నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 1 మార్చి 2024 | KHAMMAM

డీఎస్సీకి గ్రీన్‌సిగ్నల్

ఖమ్మంలో 575, భద్రాద్రిలో 447 పోస్టులు

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 2 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

సన్నద్ధమవుతున్న అభ్యర్థులు.. పుస్తకాలతో కుస్తీలు.. కోచింగ్‌కు పరుగులు..

ఖమ్మం, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. జిల్లాలవారీగా పోస్టుల ఖాళీల వివరాలను వెల్లడించింది. నూతన జిల్లాలవారీగా ఎన్ని పోస్టులను భర్తీ చేస్తారో కూడా వివరించింది. దీంతో నిరుద్యోగులు ఈ డీఎస్సీలో ఎలాగైనా ఉద్యోగాలు సాధించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇంతకాలం శిక్షణ కేంద్రాల చుట్టూ తిరుగుతూ, కనిపించిన ప్రతి పుస్తకాన్నీ తిరగేస్తూ, డీఎస్సీ ఎప్పుడు పడుతుందా అని ఎదురుచూస్తున్న వారంతా ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో ఇక పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమైపోయారు.

రెండు జిల్లాల్లో విభాగాలవారీగా పోస్టుల వివరాలు ఇలా..

విభాగం	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
స్కూల్ అసిస్టెంట్	176	129
లాంగ్వేజ్ పండిట్	18	10
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	10	01
ఎస్‌జీటీ	334	268
ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేటర్స్)	08	08
ఎస్‌జీటీ(స్పెషల్ ఎడ్యుకేటర్స్)	29	31
మొత్తం	575	447

గతంలోనే ఆర్థిక శాఖ ఆమోదం..

డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల భర్తీకి గత కేసీఆర్ ప్రభుత్వంలోనే అప్పటి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా దాదాపు పూర్తి కావొచ్చింది. ఈ డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో ఇప్పటికే అన్ని సబ్జెక్టులకు కలిపి సుమారు 15 వేలకు పైగానే ఉంటారని అంచనా. టెట్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే డీఎస్సీలో అవకాశం కల్పిస్తారు. బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు డీఎస్సీలో పోస్టులు సాధించడానికి సిద్ధమవుతున్నారు. గ్రామీణ అభ్యర్థులు పట్టణాలకు వచ్చి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందడానికి సమాయత్తమవుతున్నారు. బీఈడీ పూర్తి చేసిన వారు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు, డీఈడీ పూర్తి చేసిన వారు ఎస్‌జీటీ పోస్టులకు అర్హులు. ఈ డీఎస్సీలో ఖమ్మం జిల్లాలో 575 పోస్టులను, భద్రాద్రి జిల్లాలో 447 పోస్టులను భర్తీ చేయనున్నారు.

4 నుంచి దరఖాస్తుల స్వీకరణ

డీఎస్సీ ద్వారా చేపట్టిన టీచర్ పోస్టుల భర్తీకి మార్చి 4 నుంచి ఏప్రిల్ 3 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు. పాత జిల్లాల ఆధారంగా కంప్యూటర్ బేస్డ్ పరీక్షను నిర్వహించనున్నారు. దరఖాస్తు ఫీజు రూ.వెయ్యిగా నిర్ణయించారు. వయసు సడలింపు అవకాశం కల్పించారు.

73 పోస్టులకు 4 వేల అప్లికేషన్లు

4 వేలకు పైగా దరఖాస్తులు

జిల్లాలోని ఆస్పత్రుల్లో 73 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో స్టాఫ్ నర్సు 30, ఎంఎల్‌హెచ్‌పీ 25, పీడియాట్రిషన్ 1, ప్రోగ్రాం కోఆర్డినేటర్ 1, సీనియర్ డాక్టర్ 1, ఏఎన్ఎం 3, డీఈవో 1, క్వాలిటీ మేనేజర్ 1, మెడికల్ ఆఫీసర్ 1, పైతమాలజిస్టు 1, ఫార్మసిస్టు 3, జిల్లా డేటా మేనేజర్ 1, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ 3 పోస్టులు ఉన్నాయి. వీటికి 4 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తులు సమర్పించేందుకు బారులు తీరిన అభ్యర్థులు

- వైద్యశాఖలో వివిధ ఖాళీల భర్తీకి వెల్లువెత్తిన అప్లికేషన్లు
- చంటి పిల్లలతో వైద్యశాఖ కార్యాలయం వద్ద పడిగాపులు
- పైరవీలంటూ ఆఫీసర్లకు అధికార పార్టీ నేతల ఫోన్ కాల్స్!
- తమకు మిగిలేది మొండిచేయేనంటూ మెరిట్ అభ్యర్థుల ఆవేదన

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : జిల్లా వైద్యశాఖలో వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు వెల్లువెత్తాయి. అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 73 పోస్టులు ఉండగా.. ఏకంగా 4 వేలకు పైగా అప్లికేషన్లు అందాయి. వైద్య శాఖలోని స్టాఫ్ నర్సు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ), ఏఎన్ఎం, ఆపరేటర్లతో పాటు పలు విభాగాల వైద్యుల పోస్టులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) ద్వారా వైద్య శాఖ అధికారులు ఇటీవల ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26 నుంచి 28 వరకూ దరఖాస్తులు స్వీకరించారు. దీంతో చివరి రోజైన బుధవారం ఐడీ వోసీలోని వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి అభ్యర్థులు పోటెత్తారు. ధరఖాస్తు చేసుకునేందుకు తప్పనిసరిగా అభ్యర్థులే రావాలనడంతో బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొదటి అంతస్తులో ఉన్న కార్యాలయానికి వెళ్లేందుకు లిఫ్ట్ లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు మహిళా అభ్యర్థులు తమ చంటి పిల్లలకు పాలు పట్టిస్తూ అవస్థలు పడ్డారు. అవే అక్కట్లతో దరఖాస్తులు పూర్తి చేశారు. అయితే అధికారులు అక్కడ తాగడానికి మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదు. మరోవైపు దరఖాస్తులపైనా, వాటికి జత చేసిన సర్టిఫికెట్లపైనా గెజిటెడ్ అధికారుల సంతకాలు కావాలనడంతో చాలా మంది అభ్యర్థులు ఐడీవోసీలోని వివిధ శాఖల్లో ఉన్న గెజిటెడ్ అధికారులను వెతుక్కుంటూ వెళ్లారు. సంతకాల కోసం వారిని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే దరఖాస్తుల స్వీకరణకు ఏడు కౌంటర్లు ఏర్పాటు చేసినా అవన్నీ నిండిపోయారు.

అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తుల వివరాలను నమోదు చేసుకుంటున్న అధికారులు

అధికార పార్టీ నేతల పైరవీలు

వైద్యశాఖలో పోస్టులు దక్కించుకోవడం కోసం ఇప్పటి నుంచే పైరవీలు, బేరసారాలు మొదలయ్యాయి. 'మా వాళ్లను కచ్చితంగా చూడాలి' అంటూ అధికార పార్టీ నాయకులు ఆ శాఖలోని పెద్ద అధికారికి రెండు రోజులుగా ఒకటే ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. ఎవరికి వారు.. తాము మంత్రుల పీఏలమని చెప్పుకుంటూ అధికారులకు కాల్స్ చేస్తున్నారు. 'మా వాళ్లు ఇద్దరున్నారు' అంటూ కొందరు, మా వాళ్లు ముగ్గురున్నారు' అంటూ మరికొందరు ఫోన్లు చేస్తూ పైరవీలకు దిగుతున్నారు. ఆ శాఖ ఉద్యోగులను మచ్చిక చేసుకుంటున్నారు. ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, కానీ.. తమకు మాత్రం పోస్టు కావాలని ప్రయత్నాలు చేశారు. దీంతో డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద పైరవీకారుల తాకిడి ఎక్కువైంది. ఈ క్రమంలో ఆ శాఖ ఉన్నతాధికారులు ఫోన్లు ఎత్తడం లేదు. అయితే ఇప్పటికే ఒక మంత్రి పీఏ.. ఆ శాఖలోని ఇంకో అధికారికి ఫోన్ చేసి.. 'మీ అధికారి ఫోన్ ఎత్త లేదు. ఎటు వెళ్లారు' అంటూ వాకబు చేయడం కొసమెరుపు. కాగా.. అధికార పార్టీ నేతలు పైరవీలు చేస్తుంటే తమకు మిగిలేది మొండిచేయేనంటూ మెరిట్ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్ ఉన్న పంటలు వేయండి : డీఏవో

పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

మధిర, ఫిబ్రవరి 29 : రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసి లాభాలు గడించాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. గురువారం నాగవరప్పాడు గ్రామంలో మొక్కజొన్న, మిర్చి, పెసర పంటలను పరిశీలించిన ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగు భూములు, నీటి వనరుల ఆధారంగా లాభదాయక పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఒకే పంటను ఏటా సాగు చేయకుండా పంట మార్పిడి చేయాలన్నారు. పంట సీజన్‌కు ముందు భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలన్నారు. వానకాలంలో పత్తి, కంది, అపరాల పంటలతోపాటు ఉద్యానవన పంటలు సాగు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏవో డీఎన్‌కే.శ్రీనివాసరావు, ఏఈవోలు నిఖిత, సింధూర, రైతులు పాల్గొన్నారు.

మన దగ్గరే స్ట్రాబెర్రీ



గోల్డెన్ బెర్రీలో కాయలను పరిశీలిస్తున్న రైతు చలపతిరావు

స్ట్రాబెర్రీ, గోల్డెన్ బెర్రీ కేవలం శీతల ప్రాంతాల్లో పండే పంటలు. మన ప్రాంత వాతావరణంలో కూడా పండించవచ్చని నిరూపించారు మందలపల్లి నాగరాజు, చంటి. కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామానికి చెందిన ఈ యువ రైతులిద్దరు కలిసి ఈ ఏడాది ప్రయోగాత్మకంగా స్ట్రాబెర్రీ, గోల్డెన్ బెర్రీ పండించి ఔరా అనిపించారు. రసాయన మందులు వాడకుండానే ఆర్గానిక్ పద్ధతిలో పండించిన పంటను స్థానికంగా అమ్మకాలు చేస్తూనే, ఎగుమతి సైతం చేస్తున్నారు. మన భూమి, మన వాతావరణంలో పండుతుందో.. లేదోననే అనుమానాల మధ్య పంటవేసిన 45 రోజుల్లో దిగుబడి బాగా రావడంతో ఆ యువ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో రుచికరంగా ఉండే ఈ పండ్లు శీతల ప్రాంతాల్లోనే కాదు.. తగిన జాగ్రత్తలతో మన దగ్గర కూడా పండించవచ్చని చెబుతున్న వారి అనుభవాలను 'నమస్తే'తో పంచుకున్నారు.

– కూసుమంచి, ఫిబ్రవరి 29

కేశ్వాపురంలో పండిస్తున్న ఇద్దరు మిత్రులు శీతల ప్రాంతం పంట.. మన వాతావరణంలో.. లంబసింగి నుంచి మొక్కల సేకరణ ఆర్గానిక్ పద్ధతిలో ఆధునిక వ్యవసాయం ఎగుమతితోపాటు స్థానికంగా అమ్మకాలు ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతులు

కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామానికి చెందిన ఇద్దరు యువ రైతులు వినూత్నంగా ఆలోచించారు. ఆనవాయితీగా పండించే పంటలు కాకుండా మన ప్రాంతంలో గతంలో ఎవ్వరూ పండించని పంటలు పండించారు. కశ్మీర్‌తోపాటు శీతల ప్రాంతాల్లో మాత్రమే పండే స్ట్రాబెర్రీ, గోల్డెన్ బెర్రీ వేయాలని ఆలోచన వచ్చిందే తడవుగా ఆంధ్రాలోని లంబసింగి వెళ్లి సుమారు రూ.లక్ష ఖర్చుతో ఏసీ కంటైనర్‌లో మొక్కలను తీసుకొచ్చారు. వాటిని వారం రోజులపాటు మన వాతావరణంలో జాగ్రత్తగా భద్రపరిచి ప్రయోగాత్మకంగా కొద్ది విస్తీర్ణంలో సాగు చేసి సక్సెస్ అయ్యారు. పోగర్‌లు ఏర్పాటు చేసి వేడిని సగానికి సగం తగ్గించడంతో నెల పదిహేను రోజుల్లోనే స్ట్రాబెర్రీ చేతికొచ్చింది. వాటిని బాక్స్‌ల్లో పెట్టి ఖమ్మం, కూసుమంచి పండ్ల వ్యాపారులకు అమ్ముతూ, లంబసింగికి కూడా ఏసీ కంటైనర్‌లో ఎగుమతి చేశారు. 8 కుంటల్లో అక్టోబర్ 4వ తేదీన వేసిన మొక్కలు 45 రోజుల నుంచే దిగుబడి రావడంతో ప్రతిరోజు 20 బాక్స్‌లకుపైగా అమ్మకాలు చేస్తూ డైలీ సుమారు రూ.2 వేల ఆదాయాన్ని పొందుతున్నారు.

పూర్తి ఆర్గానిక్‌తోనే పంట..

అధిక దిగుబడులు, డబ్బులు బాగా రావాలని విచ్చలవిడిగా రసాయన మందులు వాడుతున్న ఈ రోజుల్లో పూర్తి ఆర్గానిక్ పద్ధతిలో స్ట్రాబెర్రీ పండిస్తూ ఆదర్శంగా నిలిచారు నాగరాజు, చంటి. కూసుమంచి–ఖమ్మం రోడ్డులో చేగొమ్మ క్రాస్‌రోడ్డు వద్ద వ్యవసాయ భూమిలో మిర్చి నర్సరీ కోసం నెట్, మల్చింగ్ చేసి డ్రిప్ సాయంతో మిర్చినారు పెంచారు. సీజన్ అయిపోగానే నెట్ ఖాళీగా ఉండకుండా ఒక ప్రయత్నంగా స్ట్రాబెర్రీ, గోల్డెన్ బెర్రీ పండిస్తున్నారు. ఎప్పుడూ నీటితడి ఆరకుండా నెట్‌ను రోజుకు రెండు దఫాలు తడుపుతూ వేడి వాతావరణాన్ని తగ్గించారు. రసాయన మందులు పూర్తిగా నిషేధించి సేంద్రియ ఎరువులు డ్రిప్ ద్వారా అందించి మంచి దిగుబడి సాధించారు. రుచికరమైన కేశ్వాపురం స్ట్రాబెర్రీ పండ్లను బాక్స్ రూ.100 నుంచి రూ.125 మధ్య మార్కెట్‌లో అమ్ముతున్నారు. రైతువారీగా రూ.80 నుంచి రూ.90 వరకు స్థానిక వ్యాపారులకు అమ్ముతున్నారు. రోజుకు రూ.1,800 నుంచి రూ.2,200 వరకు ఆదాయం వస్తున్నట్లు యువ రైతులు తెలిపారు.

ఆలోచనకు బీజం

మందపల్లి నాగరాజు ఇటీవల కొందరు రైతులతో కలిసి లంబసింగి ఊరు వెళ్లాడు. అక్కడ పండుతున్న స్ట్రాబెర్రీ, గోల్డెన్ బెర్రీ పంట వివరాలు తెలుసుకున్నాడు. స్నేహితుడు చంటితో కలిసి మన వద్ద కూడా పండించాలని ఆలోచనకు వచ్చారు. నాగరాజు తన తండ్రి చలపతిరావుతో మాట్లాడి 5 కుంటల్లో గోల్డెన్ బెర్రీ, 3 కుంటల్లో స్ట్రాబెర్రీ వేశారు. ప్రస్తుతం స్ట్రాబెర్రీ దిగుబడి రావడంతో మూడు నెలల నుంచి అమ్మకాలు చేస్తున్నారు. జామ్ కూడా తయారు చేసి చిన్నచిన్న డబ్బాల్లో ప్యాకింగ్ చేసి అమ్ముతున్నారు.

స్ట్రాబెర్రీ పండ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు విజయ్ చంద్ర, వాణి

వచ్చేసారి ఎకరంలో వేస్తాం..

శీతల ప్రాంతాల్లోనే కాదు మన దగ్గర కూడా స్ట్రాబెర్రీ, గోల్డెన్ బెర్రీ పండుతుంది. కానీ.. జాగ్రత్తలు తీసుకోవాలి. 8 కుంటల్లో పంటలు వేశాం. వచ్చేసారి ఎకరంలో వేస్తాం. కొంత అనుభవం వచ్చింది. మార్కెటింగ్ కూడా అర్థమైంది. భవిష్యత్‌లో కూడా పూర్తి ఆర్గానిక్ పద్ధతిలోనే సాగు చేస్తాం. మన దగ్గరికి ఇతర ప్రాంతాల నుంచి పండ్లు రావడం కంటే మన ప్రాంతంలో పండడం ఆనందంగా ఉంది. కూసుమంచి, ఖమ్మం మార్కెట్‌లో మా పంట అమ్ముతుంటే కలిగే సంతోషం చెప్పలేనిది.

– మందపల్లి నాగరాజు, రైతు

రోజూ ఆదాయం వస్తోంది..

మొక్కలు నాటినప్పటి నుంచి 45 రోజుల తర్వాత ప్రతిరోజూ ఆదాయం వస్తున్నది. స్ట్రాబెర్రీ, గోల్డెన్ బెర్రీ రెండూ పండిస్తున్నాం. స్ట్రాబెర్రీ గత నవంబర్ నుంచి రోజూ కోసి అమ్మకాలు చేస్తున్నాం. మళ్లీ ఫ్లవరింగ్ వచ్చింది. గోల్డెన్ బెర్రీ కాయలు అవుతున్నాయి.. ఇంకా పక్వానికి రాలేదు. పండు బహురుచిగా ఉండడంతో పిల్లలు, ఎలుకలు వంటివి బాగా వస్తున్నాయి. కోతులు, పక్షుల నుంచి కాపాడుకోకపోతే పంట పండించలేం. మన వాతావరణాన్ని సగానికి సగం వేడి తగ్గించినప్పుడే పంట దిగుబడి వస్తుంది.

– చంటి, రైతు

వనదేవతలకు ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

జాతరలో సమ్మక్క–సారలమ్మను దర్శించుకొని పూజలు చేస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్యే తెల్లం దంపతులు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 29 : మారాయిగూడెం సమ్మక్క–సారలమ్మ జాతర గురువారం మూడో రోజుకు చేరింది. సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులు వనదేవతలను దర్శించుకొని గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. జాతర సంప్రదాయం ప్రకారం దేవర బాలలతో కలిసి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సమయంలో పూజారులు వనదేవతలను గిరిజన సంప్రదాయ నృత్యాలు, మేళతాళాల నడుమ గద్దెకు చేర్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమ్ము నృత్యాలు, కోలాటాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎస్సై కేశవ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, అపకా వీర్రాజు, తునికి కామేశ్, మడకం ప్రసాద్, ఇర్పా చంటి, కణితి రాజమ్మ, అపకా శ్రీను, మోతుకూరి శ్రీకాంత్, దామెర్ల శ్రీనివాస్, బొల్లి శేఖర్, కొమ్ము రంజిత్, కొత్తా మల్లేశ్, పొడియం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో నిర్మాణాలు చేపట్టాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మంత్రి తుమ్మలను కలిసిన నిర్మాణ సంస్థ ప్రతినిధి

ఖమ్మం, ఫిబ్రవరి 29 : విశాలమైన స్థలంలో ఆధునిక హంగులతో ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మంలో ధ్రుమతారు కన్స్లెటెన్సీ సంస్థ ప్రతినిధులు మంత్రి తుమ్మలను కలిసి మెడికల్ కళాశాల శాశ్వత భవనాల నిర్మాణంపై వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమైనందున నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం కళాశాల నిర్వహణకు పాత కలెక్టరేట్ భవనాన్ని వాడుతున్నారని, కొత్త భవనం నిర్మాణానికి 5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందన్నారు. ఇందులో కళాశాల భవనం, వసతి గృహం, ప్రిన్సిపాల్ క్వార్టర్స్ నిర్మిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలుపగా.. కలెక్టర్‌ను సంప్రదించి.. భవిష్యత్ అవసరాలకు సరిపడా నిర్మాణాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. స్థల వైశాల్యంతోపాటు పుర ప్రముఖుల అభిప్రాయాలను సేకరించి అందుకనుగుణంగా నిర్మాణాలు ఉండాలన్నారు. రాష్ట్రంలోనే ప్రముఖ వైద్య కళాశాల అని చెప్పుకునే విధంగా తీర్చిదిద్దాలని సదరు నిర్మాణ సంస్థ ప్రతినిధులను మంత్రి ఆదేశించారు.

ప్రభుత్వ పథకాలు అందకపోతే.. మళ్లీ దరఖాస్తు చేసుకోండి..

ఈ నెల నుంచి కరెంటు బిల్లులు కట్టేపని లేదు..

రూ.500కే వంట గ్యాస్ సిలిండరూ వస్తుంది..

మెగా డీఎస్సీ వేశాం.. కొత్త రేషన్ కార్డులూ ఇస్తాం..

విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అయితే ఇంకా అర్హులెవరికైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగూడేనికి గురువారం వచ్చిన ఆయన.. చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీ ప్రకారం తమ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలనూ అమలు చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేశామని, మరో రెండు గ్యారెంటీలు ఈ మధ్యే ప్రారంభించామని గుర్తు చేశారు. అయితే మార్చి నెల నుంచి పేదలెవరూ కరెంటు బిల్లులు కట్టేపని ఉండదని అన్నారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించినట్లు చెప్పారు. అలాగే అర్హులందరికీ రూ.500కే గ్యాస్ కూడా వస్తుందని అన్నారు. ఈ పథకాలు అందని వారు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు ఉంటే వెంటనే సమీప తహసీల్దార్ల కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశామని, త్వరలోనే కొత్త రేషన్ కార్డులు కూడా ఇస్తామని అన్నారు. అనంతరం కొత్తగూడెం జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు.

మంత్రి పొంగులేటిని కలిసిన కలెక్టర్, ఎస్పీ

కొత్తగూడెం టౌన్/కొత్తగూడెం క్లైం, ఫిబ్రవరి 29 : జిల్లాకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్ రాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగూడెంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంత్రిని వారు వేర్వేరుగా కలిసి పూల మొక్కలు అందజేశారు.